## బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్ఎస్‌లో చేరుతున్న మల్లూర్ గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలకు గులాబీ కండువాలు కప్పుడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నిజాంసాగర్, అక్టోబర్ 3: మండలంలోని మల్లూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఊరటి రాములు, గొల్ల సాయిలు, గొల్ల చిన్నసాయిలు, ఈరబోయిన భూమయ్య బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. నిజాంసాగర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దుర్గారెడ్డి తదితరులు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హన్మంత్‌షిండే చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వారు పార్టీలోకి చేరినట్లు దుర్గారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మనోహర్, సర్పంచ్ ఖాసీంసాబ్, బాబూసేట్, విఠల్‌రెడ్డి, మౌలానా, దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు బతుకమ్మ చీరల పంపిణీ

సదాశివనగర్, అక్టోబర్ 3: మండలంలోని 24 గ్రామాల్లో బతుకమ్మ చీరలను బుధవారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం పదిన్నరకు చీరల పంపిణీ కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. స్థానిక సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొని చీరలను పంపిణీ చేస్తారని తెలిపారు.

# క్రీడల్లో ప్రోత్సహించేందుకే స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే
- యువత జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని పిలుపు
- పిట్లం మండలంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే



కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

పిట్లం, అక్టోబర్ 3: యువతను ప్రోత్సహించేందుకే సీఎం కేసీఆర్ ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో క్రీడా ప్రాంగణాల నిర్మాణాలు చేపట్టారని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. ఆయన మంగళవారం మండలపరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 26 గ్రామపంచాయతీలకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను సర్పంచులకు అందజేశారు. కిట్లను వినియోగించుకోవాలన్నారు. తెలంగాణ యువత జాతీయ స్థాయి క్రీడల్లో సత్తా చాటేందుకు సీఎం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సాయాగౌడ్, ఎంపీపీ కవిత, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, పిట్లం సర్పంచ్ విజయలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు అన్నారం వెంకట్‌రాంరెడ్డి, విజయ్, ఎంపీటీసీ సభ్యులు, విండో చైర్మన్లు, ఎంపీడీవో వెంకటేశ్వర్, ఎంపీవో బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

***అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే..***

మండలంలో చేపట్టే పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే హన్మంత్‌షిండే మంగళవారం ప్రారంభించారు. మండలకేంద్రంలో రూ.8 కోట్లతో నిర్మించే పిట్లం–బాన్సువాడ రోడ్డు, కంబాపూర్ నుంచి జంబిగి వరకు రూ.1.30 కోట్లు, మార్దండ నుంచి సంగారెడ్డి జిల్లా అంతర్‌గాం వరకు రూ.1.15 కోట్లతో చేపట్టే బీటీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. తిమ్మానగర్‌లో మన ఊరు మన బడి ద్వారా రూ.67.50 లక్షలతో నిర్మించే పాఠశాల అదనపు తరగతిగదుల పనులు, తిమ్మానగర్ వద్ద కాకివాగుపై రూ.3.28 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పిట్లం నుంచి సంగారెడ్డి జిల్లా కల్హేర్ వరకు రూ.1.82 కోట్లతో బీటీ రోడ్డు, పిట్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 1.18 కోట్లతో మన ఊరు మన బడి కింద నూతన గదులను ప్రారంభించారు. పిట్లంలో రూ.12 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పోతిరెడ్డిపల్లి వరకు రూ.90 లక్షలతో బీటీ రోడ్డు, చిన్నకొడప్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.68.82లక్షలు, రాంపూర్ జడ్పీహెచ్ఎస్‌లో రూ.53.85 లక్షలు, ప్రాథమిక పాఠశాలలో రూ.17.50 లక్షలతో నిర్మించే అదనపు గదుల పనులను ప్రారంభించారు. గౌరారం, గౌరారం తండాల నుంచి బండపల్లి వరకు బీటీ డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ కోసం రూ.10 కోట్లతో చేపట్టే పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేశ్, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అన్నారం వెంకట్‌రాంరెడ్డి, విజయ్, కుమ్మరి రాములు, బాల్‌రెడ్డి, సాయిరెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్, జగదీశ్, శ్రీకర్‌రెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, విండో చైర్మన్లు, ఏఎంసీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

***సమస్యలు పరిష్కరించాలని వినతి..***

మండలకేంద్రంలోని ఆశ వర్కర్లు, పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు ఎమ్మెల్యే షిండేను పిట్లంలో మంగళవారం కలిశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కోరారు. విషయాన్ని సీఎం కేసీఆర్‌కు వివరిస్తానని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు.

## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం




మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎంపీపీ కర్రె మాధవి

**తీర్మానాలు లేకుండా ముగిసిన మండల సభ**

ఎల్లారెడ్డి, అక్టోబర్ 3: ఎంపీపీ కర్రె మాధవి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఎల్లారెడ్డి మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశం ఎలాంటి తీర్మానాలు చేయకుండానే ముగిసింది. సమావేశంలో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటల వివరాలను వివరించగా.. లింగారెడ్డిపేట ఎంపీటీసీ శ్రీధర్‌గౌడ్ రుణమాఫీ ఎందుకు కావడం లేదని ప్రశ్నించారు. ఏఈవో రాజాగౌడ్ సమాధానం ఇస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్నదని, ఇప్పటికే చాలా మంది రైతుల రుణాలు మాఫీ అయ్యాయని, మిగిలిన వారికి కూడా త్వరలో మాఫీ వర్తిస్తుందన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, జడ్పీటీసీ ఊషాగౌడ్, ఎంపీడీవో లక్ష్మి, ఎంపీఈవో ప్రకాశ్, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

## సదాశివనగర్‌లో ఈజీఎస్ ప్రజావేదిక

- దుబాయిలో ఉన్న వ్యక్తి పేరుతో డబ్బులు డ్రా
- రికవరీ చేస్తాం : ఏపీడీ రాంనారాయణ



ప్రజా వేదికలో మాట్లాడుతున్న ఈజీఎస్ ఏపీడీ రామ్‌నారాయణ

సదాశివనగర్, అక్టోబర్ 3: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ సామాజిక తనిఖీ ప్రజావేదికను ఎంపీడీవో లక్ష్మి అధ్యక్షతన సదాశివనగర్‌లో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈజీఎస్ ఏపీడీ రామ్‌నారాయణ మాట్లాడుతూ.. మండలంలో 1–7–2021 నుంచి 31–3–2023 వరకు చేసిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల వారీగా పరిశీలించాయని తెలిపారు. చేపట్టిన పనులకు గాను కూలీలకు రూ.6,26,50,151 చెల్లించామని పేర్కొన్నారు. యాచారం గ్రామానికి చెందిన అంబర్‌సింగ్ దుబాయ్‌లో పనిచేస్తున్నా.. ఇక్కడ కూలీ పనిచేసినట్లు ఉపాధి హామీ పథకం డబ్బులను చెల్లించారని అన్నారు. యాచారం గ్రామంలో ఒకరికి బదులు మరొకరు పనిచేసి డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. పనిచేసిన ప్రదేశాల్లో బోర్డులు ఏర్పాటు చేయకుండానే డబ్బులు డ్రా చేశారని అన్నారు. దుర్వినియోగమైన డబ్బులను రికవరీ చేస్తామని తెలిపారు. ఉపాధి హామీ పీడీ సాయన్న, ఏపీవో మధు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలకు బీమా తప్పకుండా ఉండాలి



వాహన ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 3: వాహనాలకు తప్పకుండా బీమా కలిగి ఉండాలని ఎస్సై గణేశ్ సూచించారు. వాహన తనిఖీ వారోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డి పట్టణంలో ఆయన మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనదారులు బీమాతో పాటు వాహనాలకు స్పష్టమైన నంబర్ ప్లేట్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహనాలతో పాటు అన్ని ధ్రువపత్రాలను ఉంచుకోవాలని సూచించారు. ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదాలు జరిగితే బీమా చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై సిద్ధిఖీ, కానిస్టేబుళ్లు సిద్ధు, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

## పన్ను బకాయి ఉంటే నోటీసులు ఇవ్వాలి



భిక్‌నూర్ గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీవో ప్రకాశ్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 3: ఇంటి పన్ను బకాయిలు భారీగా ఉన్నవారికి నోటీసులు జారీ చేయాలని ఎంపీవో ప్రకాశ్ సూచించారు. మండలంలోని భిక్‌నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. జీపీ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీపీ పరిధిలో వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. ఇంటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. గ్రామంలో మురికి కాలువల, రోడ్లను శుభ్రం చేయడం తదితర పనులు నిరంతరం కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వప్న, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

***పన్నులను సకాలంలో వసూలు చేయాలి..***

గాంధారి, అక్టోబర్ 3: ఇంటి పన్నును సకాలంలో వసూలు చేయాలని ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ పనులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. పల్లె ప్రగతి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, హరితహారం మొక్కలు ఎండిపోకుండా ప్రతి రోజూ నీళ్లు పోయాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు.